* * *

కళ్యాణ మండపంలో ఆది, రంగీల కూర్చుని వున్నారు.

రాయలసీమ ఫ్లాష్‌బ్యాక్ వున్నవాణ్ణి తన అల్లుడిగా చేసుకోబోతున్నందుకు నారాయణ చాలా సంతోషంగా వున్నాడు. కానీ అతని భార్య మాత్రం పుట్టెడు దుఃఖంతో కుమిలిపోతోంది.

ఇంతలో అనుకోని విధంగా జరిగిందా సంఘటన!

"ఆగండి!" అన్న అరుపు విని, రంగీల మెడలో తాళి కట్టబోతున్న ఆదికేశవుడు ఆగిపోయాడు. ఆగండి అన్న వ్యక్తిని చూసి పారిపోబోయాడు! కాని ఎవరో అతణ్ణి పట్టుకుని ఆపారు.

"వీడి ఫ్లాష్‌బ్యాక్ అందరూ వినండి... ఈ ఆదికేశవుడు నా కూతుర్ని పెళ్ళి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి కడుపు చేసి, ఊరొదిలి పారిపోయి వచ్చిన నీచుడు!" అంటూ గర్భవతిగా వున్న తన కూతుర్ని అక్కడున్న అందరికీ చూపించాడా వ్యక్తి.

"మరి రాయలసీమ ఫ్యాక్షనిస్ట్ ప్రకాష్‌రెడ్డి ఇరవై సుమోల్లో వీడ్ని వెతుక్కుంటూ ఎందుకొచ్చాడు?" ఆ వ్యక్తిని ప్రశ్నించాడు నారాయణ.

"నేను ఆయన ఇంట్లో పనివాడ్ని. నా కూతురికిలా అన్యాయం జరిగిందని చెప్పాను. ఆయన ఇరవై సుమోల్లో హైదరాబాద్ వెళ్తూ, దార్లో వీడి గురించి ఎవరైనా చెబుతారేమోనని అలా అడుక్కుంటూ వెళ్ళాడు, అంతే!" అని వివరణ ఇచ్చాడు ఆ వ్యక్తి.

ఇంతలో నారాయణ చెంప ఎవరో చెళ్ళుమనిపించారు.

ఆ పని చేసింది ఎవరో కాదు నారాయణ భార్యే.

"చూశావా! ఇంకో నిముషం ఆలస్యం అయుంటే నా బిడ్డ బతుకు నాశనం అయిపోయి వుండేది. ఇంకెప్పుడైనా సినిమాల గురించి మాట్లాడినా, చూసినా మర్యాదగా వుండదు, జాగ్రత్త!" అని భర్త వైపు ఫ్యాక్షనిస్టులా కళ్ళెర్రజేసి చూసి, కూతుర్ని తీసుకుని నారాయణ భార్య వెళ్ళిపోయింది.

- మురికినాటి గాంధీ
(హైదరాబాద్)

# మానవత్వం

అప్పుడే వచ్చిన మా ఊరి బస్సులోకి ఎక్కి సీట్లో కూర్చున్నాను. కొన్ని నిమిషాలలో బస్సు ప్రయాణీకులతో నిండిపోయింది. ఇంతలో ఒక యువతి బస్సులోకి ఎక్కింది. ప్రయాణీకుల కళ్ళన్నీ ఆమె మీదే. ఎవరో గొప్పింటి ఆడపడచులాగుంది. సినీ హీరోయిన్లు కూడా ఆమె ముందు దిగదుడుపే!

ఆమెను చూస్తూనే తమ జన్మ ధన్యమయినట్లుగా అందరూ తదేకంగా ఆమెనే చూస్తున్నారు. ఎవరో లేచి సీటిస్తే ఆ సీటుపై కూర్చోలేక కూర్చున్నట్టు స్టైయిల్‌గా కూర్చుంది. చేతిలోని హేండ్ బ్యాగును సర్దుకుంది.

ఆరేళ్ళ బాలుడు అప్పుడే బస్సులోకి ఎక్కాడు. ప్రయాణీకులందరి దగ్గరకు వెళ్ళి "సార్! రాత్రి అన్నం కూడా తినలేదు. మా ఊరికి పోవాలంటే డబ్బుల్లేవండి, ఎవరైనా సహాయం చేయండి" అని ప్రాధేయపడుతున్నాడు. పసివాడు కదా! అడగడం కూడా చేతనయినట్లు లేదు. బస్సులో ప్రయాణం చేయడం తనకు ఇష్టం లేనట్లు విసుక్కుంటూ కూర్చున్న ఆ హీరోయిన్ దగ్గరకు వెళ్ళి డబ్బులడిగాడు.



ఆ అబ్బాయి చెంప చెళ్ళుమంది. "నా పట్టుచీరను లాగుతూ అడుగుతావా? ఎక్కడ తిరిగావో, నా చీర పాడయిపోయింది" అంటూ స్టైయిల్‌గా పట్టుచీరని హేండ్ కర్చీఫ్‌తో తుడుచుకొంటున్నది.

ఆ అబ్బాయిని చూసాను. తెల్లగా బొద్దుగా ఉన్నాడు. ఆమె కొట్టిన చెంపదెబ్బకు చెంప ఎర్రబడింది. వాడి కళ్ళలో నుండి ఏకధాటిగా కన్నీరు. అందరూ చోద్యం చూస్తున్నారు. నాలో మానవత్వం మేల్కొంది. "ఏవమ్మా! డబ్బులు ఇవ్వకపోతే పోయావు. పసివాడని కూడా కనికరం లేకుండా ఎంత దెబ్బ కొట్టావు. నీకు పిల్లలు లేరా?" అన్న నావైపు చూసి ఏదో అనాలనుకొని నా పెద్దరికాన్ని చూసి కాబోలు మొహం తిప్పుకుంది.

బస్సులోని వారందరూ నేనేదో తప్పు చేసినట్లు నావంక చూస్తున్నారు. వాణ్ణి దగ్గరకు రమ్మన్నాను. కూర్చోమని వివరాలడిగాను. హోం వర్కు చేయకుండా ఆటలాడతావా అని వాళ్ళ అమ్మ తంతే అలిగి రోడ్డుపై ఆగి ఉన్న బస్సులో ఎక్కి నెల్లూరు వచ్చాడట. రాత్రంతా నిద్రలేదని, ఏమీ తినలేదని వెక్కుతూ చెప్పాడు. రాత్రి నుంచి భయంగా వుందని వాడు చెబుతుంటే నా మనసు చలించిపోయింది. "మీ ఊరికి తీసికెళ్తాను, వస్తావా?" అని అడిగితే సరేనన్నాడు.

సెల్‌ఫోన్‌లో మా స్కూలు హెడ్మాస్టారికి 'నాకు అర్జంటు పని ఉంది. సెలవు గ్రాంటు చేయమని' చెప్పాను. ఆ కుర్రాణ్ణి తీసికొని వాళ్ళ ఊర్లో వదిలితేగాని నాకు తృప్తి ఉండదు.

కాకతాళీయంగా అప్పుడొక సంఘటన జరిగింది. పాతికేళ్ళ యువకుడు బస్సెక్కి "అమ్మగారూ నమస్కారం" అని ఆవిడను పలుకరించడం, ఆమె చిరునవ్వు నవ్వటం జరిగింది.

కారు చెడిపోయిందని, రెడ్డిగారు షెడ్‌కు పోయి రిపేరు చేయించుకొని గంట తర్వాత వస్తానన్నారని, మధ్యాహ్నం తిరుపతి ప్రయాణం ఏర్పాట్లకు నన్ను బస్టాండులో దింపి వెళ్ళారని చెబుతూ, బస్సు ఎక్కిందానికి బాధపడుతున్నట్లు ఆ యువకునితో చెబుతున్నది. ఆమెతో మాట్లాడే భాగ్యం కలిగిన వాడెవరా అని కొందరు ఆ యువకుని చూస్తున్నారు.

టిక్కెట్టు కోసం వచ్చిన కండక్టరుకు వంద రూపాయల నోటు యిచ్చి, ఇద్దరికి టిక్కెట్లు ఇమ్మని దర్జాగా చెప్పడం, కండక్టరు ఇచ్చిన చిల్లరను లెక్కించకనే పర్సులో వేసుకోవడం గమనించిన నాకు బస్సు ఎక్కినపుడు అప్సరసగా కనిపించిన ఆమెలో మానవత్వ లక్షణాలేమీ నాకు కనిపించలేదు.

ఆ అబ్బాయిని తీసికొని, హోటల్‌లో టిఫిన్ తినిపించి, వాళ్ళ ఊరికి పోయే బస్సెక్కాను.

- తిప్పావఝుల సుబ్రహ్మణ్యం
(ఇందుకూరుపేట)